నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ ఈనెల 10వ తేదీన సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు ఉదయం 9 గంటకల్లా తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే నియోజక వర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజాసమస్యల పరిష్కారవేదికలో నియోజకవర్గ, మండలస్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

విజయవాడకు తరలిన వెళ్లిన అంగన్వాడీలు

నేడు ఎక్కడికక్కడ ధర్నాలకు సిఐటియు పిలుపు

చలో విజయవాడకు బయలుదేరిన కుప్పం అంగన్వాడీ వర్కర్లు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం అంగన్వాడీలు మహాధర్నా కోసం భారీగా చిత్తూరు జిల్లా నుంచి విజయవాడకు వెళ్లడం జరిగిందని యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, యూనియన్ జిల్లా కార్యదర్శి లలిత, షకీలా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల కాలంలో అంగన్వాడీలకు ఎప్పుడూ కూడా 10 తేదీన ప్రాజెక్టు సమావేశాలు సెక్టార్ మీటింగ్లు పెట్టిన పరిస్థితి లేదని, ఇప్పుడు అంగన్వాడీలను కట్టడి చేయడానికి ఉద్దేశం పూర్వకంగానే పదో తారీఖున మీటింగ్ పెట్టి ఆ మీటింగ్‌కు రాని వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరిక జారీ చేశారని, ఇది ఏమాత్రం రాజ్యాంగబద్ధమైనది కాదని అన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల బెదిరింపులకు కొంతమంది ఆగిపోయిన వారందరూ కూడా ఎవరు సెంటర్లు తీయకుండా ఆయా ప్రాజెక్టు కార్యాలయం దగ్గర ధర్నా కార్యక్రమం చేయాలని పిలుపునిచ్చారు. ఇలాంటి నిర్బంధాలను అంగన్వాడీలు ఎన్నో చూశారని వారిపై ఉక్కుపాదం మోపిన ప్రభుత్వాలు ఏవీకూడా మనుగడ సాధించలేదని ఈ ప్రభుత్వానికి గతంలో అనుభవం ఉన్నప్పటికీ మరోసారి అంగన్వాడీలపై ధమనకాండక పాల్పడడం దారుణమన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కారం చేసే దిశగా ఆలోచించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అంగన్వాడీలు మరోసారి ఈ ప్రభుత్వానికి పోరాటంతో రుచి చూపిస్తారని హెచ్చరించారు.

శాంతిపురం అంగన్వాడీ వర్కర్లు

కార్వేటినగరం ప్రాజెక్టు అధ్యక్షురాలు

విజయ గృహ నిర్బంధం

పోలీసుల తీరును ఖండించిన సిఐటియు

అంగన్వాడీ ఇంటి ముందు పోలీసులు

ఎస్ఆర్ పురం: రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం విజయవాడలో మహాధర్నా కార్యక్రమానికి చిత్తూరు జిల్లా నుంచి బయలుదేరుతున్న కార్వేటినగరం ప్రాజెక్టు అధ్యక్షురాలు విజయను గృహనిర్బంధం చేయడం దారుణమని పోలీసులు తీరును యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడుతూ అన్ని రకాలుగా ధర్నాకు అనుమతులు ఉన్నప్పటికీ పోలీసులు తప్పుడు సమాచారంతో పర్మిషన్ లేదని చెప్తూ అంగన్వాడీ నాయకులను గృహనిర్బంధం చేస్తే ఎవరు వెళ్లరనే ఉద్దేశంతో అడ్డుకోవాలని చూడడం దారుణమన్నారు. ఎన్ని రకాలుగా అడ్డుకునే ప్రయత్నాలు చేసినా ధర్నా జరిగి తీరుతుందని తెలిపారు. ఎలాంటి ఆదేశాలు లేనప్పటికీ పోలీసులు ఎస్పి ఆదేశాలు ఉన్నాయని నోటీసులు ఇవ్వడం, గృహనిర్బంధం చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాజ్యాంగ హక్కును కూడా పోలీసులు అరించడం సిగ్గుచేటు అని, పోలీసులు తీరు బాధాకరమన్నారు.

హార్టికల్చర్ పంటలకు కేంద్రంగా పలమనేరు

రైతు బజార్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అమర్

ప్రజాశక్తి- పలమనేరు పలమనేరు పట్టణంలోని వారపుసంత ఆవరణలో అగ్రికల్చర్ మార్కెట్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు బజార్‌ను ఆదివారం పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈప్రాంతం హార్టికల్చర్ (ఉద్యాన) పంటల సాగుకు పలమనేరు గుండెలాంటిదని, పండ్లు, కాయగూర పంటలకు ఎంతో అనుకూలమైన ప్రాంతమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు పండించిన పంటలను ఆయన పరిశీలించి వారి నుంచి కొనుగోలు చేశారు. రైతులను అన్నివిధాల ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగా రైతులు పండించిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించాలనే ఉద్దేశంతో రైతు బజార్‌లను ఏర్పాటు చేస్తోందన్నారు. రైతు బజార్లతో రైతులకు, వినియోగదారులతో పాటు చిరు వ్యాపారులకు ఎంతో ఉపయోగకరమని వివరించారు. రైతుల సౌకర్యార్థం పలమనేరు సమీపంలోని కేటిల్ఫామ్ వద్ద మెరుగైన సౌకర్యాలతో 33ఎకరాలలో మోడల్ మార్కెట్ యార్డు ఏర్పాటు కానుందన్నారు. దీంతో ఈ ప్రాంత రైతుల పంటలను సులభంగా మార్కెటింగ్ చేసుకునేందుకు వీలుంటుందని తెలిపారు. రైతులు పండించిన పంటలను తక్కువ సమయంలో బెంగళూరు, చెన్నై నగరాలతో పాటు తిరుపతిలకు తరలించి మంచి ధరలను పొందేవీలుంటుందని పేర్కొన్నారు. మరోవైపు రామకుప్పం సమీపంలో కార్గో విమాన సేవలు సైతం అందుబాటులోకి రానున్నాయని దాంతో మన ఉత్పత్తులు విదేశాలకు తరలించే అవకాశం ఉంటుందని తెలియజేశారు. కాబట్టి ఈ ప్రాంత రైతులు ఉద్యాన పంటల సాగు వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఏడీఎం పరమేశ్వరన్, డీఈ హరినాథ రెడ్డి, ఏఈ రాజన్న, కార్యదర్శి సంజీవ్ కుమార్, ఆర్‌వి.బాలాజీ, మాజీ ఏఎంసీ చైర్మన్ రామచంద్ర నాయుడు, కుట్టి, గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడ్ పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడి

నష్టపోతున్న రైతులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పంటలపై ఏనుగుల దాడులు వలన నష్టపోతున్నారని రైతులు మొరపెట్టుకుంటున్నారు. శనివారం రాత్రి బంగారుపాళ్యం మండలం వెలుతురు చేను పంచాయతీ పులిమడుగు గ్రామానికి చెందిన రైతు బాలాజీకి సంబంధించిన వరి పైరు ఏనుగులు గుంపు తిని, తొక్కి ధ్వంసం చేశాయి. ఆరుగాళ్ల కష్టపడి పంటను ఏనుగుల నాశనం చేయడంతో రైతు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. పగలు కోతుల బెడద, రాత్రి ఏనుగులు, అటవి జంతువుల పంటలపై పడి నాశనం చేస్తున్నాయని, అప్పులు చేసి పండించిన పంటలను చేతికందటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్పందించాలని పలుమార్లు అధికారులు, ప్రభుత్వాన్ని కోరుతున్నా స్పందన లేదని వాపోయారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఏనుగులను పంటల పైకి రాకుండా ఉండేందుకు కందకాలు, సోలార్ పెన్సింగ్‌లు ఏర్పాటు చేసి పంటలన కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.

తీరిన తాగునీటి సమస్య

నూతన బోర్ మోటార్ ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని కమ్మనపల్లి కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బోరు మోటార్‌ను పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. గత రెండు నెలలుగా పాఠశాలలో నీటి కొరత ఉండడంతో అధికారులు ఎమ్మెల్యేకు సమస్యను విన్నవించారు. వెంటనే స్పందించిన ఆయన బోరు మోటార్ మంజూరు చేయించారు. రెండ్రోజుల క్రితం పాఠశాల ఆవరణలో బోర్ వేయడంతో పుష్కలంగా నీరు పడ్డాయి. దీంతో పాఠశాల విద్యార్థుల నీటి సమస్య పరిష్కారమైంది. అనంతరం ఎమ్మెల్యే పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని, విద్యార్థులకు అవసమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా మోడల్, గురుకుల పాఠశాలల హెచ్‌ఎంలు స్వరూప, అనిత, నాగజ్యోతి, టీడీపీ నాయకులు కిషోర్ గౌడ్, సుబ్రహ్మణ్యం శెట్టి, రఘు చంద్రగుప్తా పాల్గొన్నారు.

12న వారపు సంత బహిరంగ వేలం

ప్రజాశక్తి- శాంతిపురం: మండల పరిధిలోని కెనమాకులపల్లి గ్రామపంచాయతీ బడుగుమాకులపల్లి వారపు సంత వేలం ఈనెల12న కెనమాకులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి జి.అశ్వత్థనారాయణ, కెనమాకులపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ఏవి.జయరాం ఆదివారం ఓ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. వేలంలో పాల్గొనేవారు వేలం నోటిఫికేషన్ నియమ నిబంధనలకు లోబడి వారపు సంత అంగళ్ళు, పశువుల వారపు సంత, ఆటోలు ప్రైవేటు వాహనాల రుసుం, గొర్రెలు, కోళ్ళు వారపు సంతలకు గుత్తకు డిపాజిట్లు పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ కెనమాకులపల్లి పేరున స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆరిముత్తనపల్లి శాఖలో డిపాజిట్లు చెల్లించి సాల్‌వెన్సి సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. వేలంలో పాల్గొను వారు పంచాయతీకి ఎలాంటి పన్నులు, సిస్తులు, లీజు మొత్తం బాకీ ఉండకూడదన్నారు.

జిల్లా స్థాయి చిత్రకళాపోటీలో

యాదమరి విద్యార్థినికి ప్రథమ బహుమతి

ప్రజాశక్తి- యాదమరి: సమగ్రశిక్ష, డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు జిల్లా స్థాయి నేషనల్ సైన్స్ డే కార్యక్రమంలో చిత్తూరు లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో డీఈవో వరలక్ష్మీ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.పూజిత ప్రథమ బహుమతి గెలుపొందగా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మద్దిపట్ల వెంకటరమణ నాయుడు పూజితకు బహుమతిని అందజేశారు. డివైఈవో బి.చంద్రశేఖర్, బి.అరుణ్ కుమార్, ఏ.మురళి సింగ్, ఆర్ట్ మాస్టర్ కె. దామోదరాచారి, వినాయక ఆచారి పాల్గొన్నారు.

నూతన గ్రంథాలయానికి భూమిపూజ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరంలో రూ.3,10,0000ల వ్యయంతో నిర్మించనున్న నూతన గ్రంథాలయ భవన నిర్మాణంకు ఆదివారం చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ తల్లిదండ్రులు భూమి పూజ చేశారు. నగరంలోని విద్యార్థులకు, యువతకు ఉపయోగపడేలా నూతన గ్రంథాలయంలో అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భీమినేని చిట్టిబాబు, రమేష్, సుబ్రహ్మణ్యం రెడ్డి, గ్రంథాలయ సిబ్బంది డిప్యూటీ లైబ్రేరియన్ లలిత, గుణశేఖర్, సుల్తానా భాను, తులసి కుమార్ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులు

సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య

ఇంటర్వ్యూ

చెన్నయ్య
సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించి, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ మేరకు జిల్లాలోని 48 సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో 12 కోట్ల 30 లక్షల రూపాయలతో మౌలిక వసతులు కల్పించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య తెలిపారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో చేపడుతున్న మౌలిక వసతుల వివరాలను తెలిపారు.

ప్రజాశక్తి: ఎన్ని సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు మౌలిక వసతులు కల్పిస్తున్నారు?

డిడి: చిత్తూరు జిల్లాలో 56 సాంఘిక సంక్షేమ వసతి గృహాలున్నాయి. ఇందులో 48 సాంఘిక సంక్షేమ వసతి గృహాలను ఎంపిక చేసి 12 కోట్ల 30 లక్షల రూపాయలతో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నాం. అలాగే చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మంజూరు చేసిన 47లక్షల రూపాయలతో నాలుగు సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరుగుతోంది.

ప్రజాశక్తి: వసతి గృహాల్లో మౌలిక వసతుల ఏర్పాటు చేపడుతున్న శాఖలు ఏవి?

డిడి: సంక్షేమ వసతి గృహాల్లో చేపడుతున్న మౌలిక వసతులను పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి ఇంజనీర్ల పర్యవేక్షణలో టెండర్లను ఆహ్వానించి పనులను చేపట్టడం జరుగుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఎంపిక చేసిన 48 సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగింది.

ప్రజాశక్తి: ఈఏడాది పదవ తరగతి పరీక్షలకు ఎంత మంది విద్యార్థులు హాజరవుతున్నారు?

డిడి: జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు ఏడాది 280 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరికి ట్యూటర్ల ద్వారా తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన విద్యాబోధన అందించడం జరిగింది. అలాగే ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను అందించాం. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఆశిస్తున్నాం.

ప్రజాశక్తి: సాంఘిక సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు ఎన్ని?

డిడి: సాంఘిక సంక్షేమ శాఖ జిల్లాలో ఏఎస్‌డబ్ల్యూఓలు 6 మంది పనిచేస్తున్నారు. వార్డెన్ పోస్టులు 13 ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగింది. త్వరలో భర్తీ చేసే అవకాశం ఉంది.

ప్రజాశక్తి: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు ఎప్పటిలోగా తీసుకునే అవకాశం ఉంది.

డిడి: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వివిధ రకాల సబ్సిడీ రుణాల మంజూరుకు సంబంధించి ఆన్లైన్ పోర్టల్ ప్రారంభం కావాల్సి ఉంది. సబ్సిడీ రుణాలకు సంబంధించి విధివిధానాలు ఖరారు చేసి ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించనుంది. కార్పొరేషన్ ద్వారా ట్రాన్స్పోర్ట్ వాహనాలు, పాడి ఆవులు, మేకలు గొర్రెలు, వ్యవసాయ యంత్రాలు, ట్రాక్టర్లు, షామియానా టెంట్లు కుర్చీలు సబ్సిడీ రుణం కింద యూనిట్లు మంజూరు చేసే అవకాశం ఉంది.

పోషకాలు నిండిన పుచ్చకాయ

- కొనుగోలుకు ఎగబడుతున్న జనం
- జోరుగా విక్రయాలు
- ఆరోగ్యంతో పాటు ఎండల నుంచి ఉపశమనం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పుచ్చకాయలు ఆరోగ్యానికి చాలా మంచిది. వీటిలో పోషకాలతోపాటు వేసవి ఎండల నుంచి శరీరంలో వేడిని తగ్గించడంతో పాటు ఉపశమనం కల్గిస్తుంది. ఎండాకాలంలో దీని తినడం ఎంతో మేలు అని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. వేసవితాపం, దాహాన్ని తీర్చేందుకు అద్భుతమైన ఫలం పుచ్చకాయ. వేసవి సమయంలో మన శరీరంలో వాటర్ లెవెల్స్ (నీటిస్థాయి) తగ్గిపోతుంటాయి. డీహైడ్రేషన్ స్టేజ్‌కి వెళ్లిపోతుంటాం. అలాంటప్పుడు వడదెబ్బ భారినపడి.. కళ్లు తిరిగి కింద పడిపోతుంటారు. ఈ పరిస్థితి ఒక్కోసారి ప్రాణాలకే ప్రమాదం. అందుకే మన శరీరంలో వాటర్ లెవెల్స్, షుగర్ లెవెల్స్ తగ్గి పోకుండా ఉండేందుకు పుచ్చకాయ ముక్కలు తినడం బెస్ట్ ఆప్షన్ అని అంటున్నారు వైద్యులు. పుచ్చకాయలో ఉండే విటమిన్లు, పోషకాలు, వ్యాధి నిరోధక శక్తిని పెంచే యాంటి ఆక్సిడెంట్లు, బి విటమిన్, క్యాల్షియం, సోడియం, మెగ్నీషియం, పొటాషియం, క్లోరిన్, జిటాకెరోటిన్లు, ఆల్కలైన్, విటమిన్-ఏ, విటమిన్ బి-6, విటమిన్-సి, సుక్రోజ్, ప్రక్టోజ్, గ్లూకోజ్, ఎలక్ట్రోలైట్లు.. ఎండాకాలంలో మన శరీరానికి కావాల్సిన పోషకాలను అందిస్తాయంటున్నారు.

ఆర్కిమెన్ రకాలకు డిమాండ్

ప్రస్తుతం రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి శరీరానికి ఉపశమనం కల్పించి, ఆరోగ్యం అందిపుచ్చుకునేందుకు చాలామంది పుచ్చకాయలను కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. చిన్నారుల దగ్గర నుంచి వృద్ధుల వరకు వీటిని ఎంతో ఇష్టంగా తింటున్నారు. దీంతో పుచ్చకాయల అమ్మకాలు జోరందుకున్నాయి. ఎక్కడికక్కడ వెలసిన స్టాళ్లు, దుకాణాల్లో విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. మధుఫలం, షుగర్బేబీ, ఆర్కిమెన్ వంటి రకాలకు మంచి గిరాకీ ఉందని వ్యాపారులు చెబుతున్నారు. మార్కెట్లో కిలో పుచ్చకాయ ధర రూ.16 నుంచి రూ.20 పలుకుతుండగా, పుచ్చకాయ ముక్క రూ.10 పలుకుతుంది. 100 గ్రాముల పుచ్చకాయలో 81.45 గ్రాముల నీరు, 6 శాతం చక్కెర, 90 కేలరీల శక్తి, 7.6 గ్రాముల పిండి పదార్థాలు, 0.6 శాతం మాంసపుకృత్తులు ఉంటాయి. పొటాషియం, 7 గ్రాముల కాల్షియం, మిల్లీ గ్రాము సోడియం ఉంటాయి.

ఆరోగ్యం మేలు చేస్తుంది..

- శిరీష, వైద్యాధికారి బంగారు పాల్యం

పుచ్చకాయ తినడం వలన శరీరానికి కావల్సిన పోషకాలను అందించి వేసవిలో ఆరోగ్యం కలిగిస్తుంది. వయసుతో సంబంధం లేకుండా అందరూ దీనిని తినొచ్చు. వేసవిలో ఇది తింటే వేసవితాపం నుంచి రక్షణ పొందవచ్చు. వీటిని తరచూ పండ్ల రూపంలోగానీ, జ్యూస్ రూపంలోగానీ తీసుకోవడం వలన శరీరంలో ఉష్ణోగ్రతలను తగ్గించి తక్షణ శక్తిని ఇస్తుంది.

ప్రయోజనాలు

- వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.
- మలబద్ధకం రాకుండా చేస్తుంది.
- వృద్ధాప్యంలో అంధత్వం నివారిస్తుంది.
- రక్తప్రసరణ సక్రమంగా అవుతుంది.
- వేసవితాపం నుంచి ఉపశమనం కలిగిస్తుంది.
- తక్షణ శక్తిని ఇస్తుంది
- అలసట రాకుండా చేస్తుంది.

సెక్రటేరియట్ ఇంజనీర్ల క్రీడాపోటీలు

క్రీడా పోటీల్లో పాల్గొన్న సెక్రటేరియట్ ఇంజనీర్లు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ చిత్తూరు జిల్లాలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు జిల్లాస్థాయి క్రీడాపోటీలు ఆదివారం చిత్తూరులో గల మెకానిక్ గ్రౌండ్‌లో నిర్వహించడం జరిగింది. ఇందులో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు చిత్తూరు జిల్లాలో గల 31 మండలాల నుంచి అందరూ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఈ క్రీడల పోటీల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అందరూ తమ ప్రతిభను కనబరిచారు. ఇందులో క్రికెట్ విన్నర్‌గా జీడీ నెల్లూరు 2, వాలీబాల్ విన్నర్‌గా పుంగనూరు, బ్యాడ్మింటన్ విన్నర్‌గా మనోజ్, కళ్యాణ్, భాగ్యరాజ్, జాస్మిన్, విజేతగా రాజేష్, ఏఎస్ వాణి, క్యారమ్స్ విన్నర్‌గా సృజన, మమత అత్యుత్తమ ప్రదర్శన కనపరిచి విజేతగా నిలిచారు.

ఎస్సీ వర్గీకరణ మాలలకు అన్యాయం

మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఎస్సీ వర్గీకరణ చేయకూడదని, క్రిమిలేయర్ అమలు నిలిపివేయాలని మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు డిమాండ్ చేశారు. వర్గీకరణ నిర్ణయాన్ని అమలు నిలిపివేయాలని కోరుతూ ఈ నెల 23వ తేదీన తిరుపతి మున్సిపల్ గ్రౌండ్‌లో జరగనున్న రాయలసీమ మాలల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం చిత్తూరు బాన్స్ హోటల్‌లో మాలల సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మాలల ఐక్యతని చూసి ఓర్వలేక కొందరు మాల, మాదిగలను రెండుగా చీల్చేందుకు కుట్రపన్నుతున్నారని తెలిపారు. మాలలు అడుగడుగున వివక్షతకు గురవుతున్నారని, దీన్ని ఎదుర్కోవాలంటే విద్యపరంగా ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే సాధ్యమవుతుందన్నారు. వర్గీకరణ అడ్డుకునేందుకు తిరుపతిలో నిర్వహిస్తున్న మాలల సింహగర్జనలో మాలల సత్తా ఏమిటో చూపాలన్నారు. ఇందుకు గాను లక్షలాదిమంది మాలలు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు సుదర్శన్, రవి, ప్రకాష్, ప్రభాకర్, పరదేశి, ధనంజయ, ఉద్యోగ సంఘాలు నాయకులు రాఘవులు, దొరై కన్నన్, గణేష్, లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మండల పరిధిలోని అరగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985 - 86వ సంవత్సరం 10వ తరగతి పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. అరగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి విశ్రాంత ఉపాధ్యాయులు యాగమూర్తి పిళ్ళై, ఎల్.కృష్ణారెడ్డి సుందరరాజులు, జగత్ జ్యోతీశ్వరరెడ్డి, వెంకటస్వామి, బాబుసాహెబ్, కృష్ణమూర్తి నాయుడు, రాజేశ్వరి, లోకేశ్వరి, శ్రీదేవి, మొగిలమ్మ హాజరయ్యారు. సీనియర్ విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు యాగమూర్తిపిళ్లై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను బాగా చూసుకున్న రోజే వారి చదువులకు సార్థకత అవుతుందన్నారు. 39 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులందరూ ఒకచోట కలిసి ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు గడపడం సంతోషాన్నిస్తోందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్చార్జి కోరిక మేరకు పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తమ వంతు సాయం చేస్తామని పూర్వవిద్యార్థులు హామీ ఇచ్చారు. నిర్వాహకులు కేబీ ఉమాపతి, ధర్మేంద్ర, జయంతిరెడ్డి, మన్నారు ప్రసాద్, కుమార్ నాయుడు, రెడ్డిప్రసాద్, మాధవి, కమలాపతి, సుకుమార్, పూర్ణచంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోగులకు పరిశీలిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -కార్వేటినగరం : అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ అమెరికా వారి ఆర్థిక సౌజన్యంతో కార్వేటినగరం మండలం సురేంద్రనగరం దాసరి గుంట, ద్వారక నగరం గ్రామ ప్రజల సౌకర్యార్థం కోసం ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి, దంత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని ఎం నిషిధరాజు పేర్కొన్నారు. ఈ శిబిరానికి దాదాపుగా 300 మంది ఉచిత కంటి రోగులు, దంత రోగులు పాల్గొన్నారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరానికి ఒకసారి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ పి రవిరాజు, హిమజ విద్యా సంస్థల ఛైర్మన్ ఎం సురేంద్ర రాజు, వాసన్ ఐకేర్ స్పెషలిస్ట్ డాక్టర్ బృందం, విజయ మల్టీ స్పెషలిస్ట్ డెంటల్ క్లినిక్ తిరుచానూరు,

గంగాధర నెల్లూరులో

సుబ్బు రామరాజు, నాగేశ్వర రాజు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు లోని ఎంపీడీవో కార్యాలయంలో బిగ్ టీవీ బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హెల్త్ క్యాంపులో 200 మంది రోగులు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేసుకున్నారు. ఈ సందర్భంగా గుండె, కాలేయం, కంటి , కీళ్ళు, ఎముకలు, తదితర పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి కార్పొరేట్ వైద్యశాలను ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయడం సంతోషదాయకమని మీ సేవలను మరింత విస్తరించాలని కోరారు.

బైరెడ్డిపల్లిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెన్నై శంకర్ నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించారు.ఈ చికిత్సా ఈ శిబిరానికి మండలం లోని కంటి సమస్యలతో బాధపడుతున్న 52 మంది హాజరయ్యారు. కంటి శస్త్ర చికిత్స అనంతరం 20మంది కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వారికి ప్రఖ్యాతి గాంచిన చెన్నై శంకర నేత్రాలయ హాస్పిటల్లో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహించి ప్రయాణం, భోజనం, వసతి, మందులు అందిస్తామని తెలిపారు. శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారికి వారి సహాయకులకు మధ్యాహ్న భోజనం ,తాగునీరు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో శంకర నేత్రాలయ డాక్టరు మురళీ కృష్ణ, డాక్టరు శ్రీనివాసులు, డాక్టరు .రమణ, డాక్టరు గంగాధరం, చంద్ర, చిన్నప్ప పాల్గొన్నారు,

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - కుప్పం రూరల్:
కుప్పం పట్టణంలోని జనసేన కార్యాలయంలో జనసేన నియోజకవర్గం సమన్వయకర్త నరేష్ ఆధ్వర్యంలో జనసైనికులు చలో పిఠాపురం కార్యక్రమ గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 14వ తేదీన పిఠాపురంలో జనసేన ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ వేడుకలను విజయవంతం చేయడానికి జనసైనికులు, వీర మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జనసేన ఆవిర్భావ వేడుకలు విజయవంతానికి తమ వంతు బాధ్యతగా నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించిన పార్టీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని జనసైనికులు, వీర మహిళలు ఏకమై చలో పిఠాపురం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామమూర్తి, వేణు, మునెప్ప, వామనమూర్తి, పవన్ మహేష్, అమీర్, హరీష్, కిషోర్, నవనీత, సురేష్, గణేష్, హంసాగిరి, బాలు, పవన్, భాస్కర్, పాండు, చంద్రశేఖర్, రాహుల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రిక్రియేషన్ క్లబ్ సభ్యులు

ముగిసిన రిక్రియేషన్ క్లబ్ సమావేశం

ప్రజాశక్తి -పలమనేరు:
చిత్తూరు జిల్లా పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం మధ్యాహ్నం సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా ముగిసింది. ఈ సర్వసభ్య సమావేశంలో హాజరైన సభ్యుల ఆమోదంతో సభ్యుల సంవత్సర చందా వెయ్యి రూపాయల నుండి 500 రూపాయలుగా తగ్గించి తీర్మానించారు. రిక్రియేషన్ క్లబ్ ఉన్న పాత భవనానికి సివిల్ ఇంజనీరు సలహాలతో మరమ్మతులు చేసేందుకు ఆమోదం తెలిపారు. అనంతరం సభ్యులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

లోన్ రెన్యూవల్‌కు అవస్థలు

- బ్యాంకు చుట్టూ రైతుల ప్రదక్షిణ • ఫీల్డు ఆఫీసర్‌కు సెలవు • రైతుల అవస్థలు వర్ణనాతీతం

ప్రజాశక్తి -వెదురుకుప్పం : రైతులు తాము తీసుకున్న రుణాలను వడ్డీతో పాటు చెల్లించి తిరిగి రుణం పొందేందుకు రైతులు బ్యాంకు చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణ చేయాల్సి దుస్థితి ఏర్పడింది. సంబంధిత బ్యాంకు మేనేజరు ఫీల్డు ఆఫీసరు సెలవులో వున్నారని పలు కారణాల చెబుతుండడంతో రైతులకు దిక్కుతోచని అయోమయ స్థితి ఏర్పడుతోంది. ఎన్నో ఏళ్లుగా రుణం తీసుకుని చెల్లిస్తున్న బ్యాంకులో విధిస్తున్న సరికొత్త నిబంధలనలతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. తమకు సకాలంలో పంటల పెట్టుబడికి అవసరమైన రుణాలు అందక ప్రైవేటు వ్యక్తులను, ఇతర వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు రుణం తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోందని రైతులు వాపోతున్నారు. రుణాల రెన్యూవల్‌కు రైతులు పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా మారింది..

గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో వెదురుకుప్పం మండలం, పచ్చికాపల్లంలో ఇండియన్ బ్యాంకు వుంది. ఈ బ్యాంకు సుమారుగా 60 సంవత్సరాలపైగా వున్న ప్రస్థానం వుంది. పరిసర గ్రామాలలో పచ్చికాపల్లం ఇండియన్ బ్యాంక్ అంటే ఓ నమ్మకం..ఎంతో ఉత్తమ సేవలు అందిస్తూ ఇటు అన్నదాతలకు, అటు వ్యాపారస్తులకు, పొదుపు సంఘాలకు అందరికీ రుణాలు ఇస్తూ ఆర్థికంగా ఆదుకుంటూ విశ్వాసానికి ప్రతీకగా మారింది. అయితే ఇప్పుడు ఆ నమ్మకం క్రమేణా సన్నగిల్లుతోంది. ఎందుకిలా అయ్యిందో అర్థం కావడంలేదని రైతులు అయోమయం వ్యక్తం చేస్తున్నారు.

బ్యాంకు పరిధిలో మాంబేడు, పచ్చికాపల్లం, కొమంగుంట, గొడుగు చింత, అగ్గి చేనుపల్లి, పెరుమాళ్ళ పల్లి, తిరుమలయ్య పల్లె తదితర పంచాయతీలు ఉన్నాయి.

పచ్చికాపల్లం ఇండియన్ బ్యాంకులో రైతులు ప్రతి సంవత్సరానికి ఒకసారి తేదీకి లోబడి బ్యాంకు వారు లోనుగా ఇచ్చిన మొత్తం సొమ్ము, బ్యాంకు వడ్డీతో కలిపి చెల్లించాలని రుణ నిబంధన వుంది. రెన్యూవల్ అయితే వారంలోపు డాక్యుమెంట్స్ అంతా పరిశీలించి, రైతుల ఖాతాలో తిరిగి మళ్లీ జమ చేస్తారు. అదే ఐదు సంవత్సరాలు దాటిన ఫైల్ అయితే, మళ్లీ కొత్తగా రైతులకు సంబంధించి బ్యాంకు వారు చెప్పిన అన్ని డాక్యుమెంట్లు ఇవ్వాల్సి వుందని, ఇది కాలపరిమితి ఒక నెల గడుస్తుందని ప్రస్తుతం ఈ ఇండియన్ బ్యాంకు లో పరిస్థితులు ఆశించిన స్థాయిలో లేవని రైతులు చెబుతున్నారు.

ఫీల్డు ఆఫీసర్ సెలవుతో ఇబ్బందులు

పచ్చికాపల్లం ఇండియన్ బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి రెండు నెలల సెలవులపై వెళ్లారు. గడువు ముగిస్తుండడంతో రైతులు బ్యాంకు అధికారి దగ్గర కట్టాల్సిన సొమ్ము వడ్డీ ఎంతో కనుక్కొని బ్యాంకులో జమ చేస్తున్నారు. కట్టిన తర్వాత బ్యాంకు మేనేజర్‌ను సంప్రదిస్తే 'ఫీల్డ్ ఆఫీసర్ లీవులో వున్నాడు.. వచ్చిన తర్వాత చేస్తాం..' అని సమాధానం ఇస్తున్నారని రైతులు చెబుతున్నారు. దీంతో రైతులు తమకు తెలిసిన వారి దగ్గర అప్పు చేసి బ్యాంకుకు చెల్లించి రుణం భారం సమస్యను పరిష్కరించుకుంటున్నారు. బ్యాంక్ మేనేజర్ సరి కొత్త నిబంధ తెలపడంతో రెన్యూవల్ రుణాలు అందక రైతులు ప్రైవేటు వ్యక్తులను, ఇతర వ్యాపారులను ఆశ్రయిస్తూ తీవ్ర ఆవేదనకు గురవుతున్నామని రైతులు వాపోతున్నారు. అప్పు తెచ్చిన వారి దగ్గర మాట పోతుందని ఆలోచిస్తున్నారు. ఏమి చేయాలో దిక్కుత తెలియక ఇంట్లో ఉన్న నగలను మార్వాడి అంగట్లో తనకా పెట్టి అప్పు తెచ్చిన వారికి వడ్డీతో తిరిగి చెల్లిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

పరిస్థితిని చక్కదిద్దాలి..

బ్యాంకులో రైతు నగలు తాకట్టుపెట్టి అప్పు చెల్లించిన రసీదు

గతంలో ఎప్పుడూ ఇలా లేదు.. డబ్బులు చెల్లించిన వారం లోపే బ్యాంకు వారు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు. ఇప్పుడు కొత్తగా వుంది. ఎందుకిలా చేస్తున్నారో అర్థం కాలేదు. పై స్థాయి అధికారు లు రైతుల సమస్యలు చక్క దిదాలి. పచ్చి కాపల్లం బ్యాంకులో నగలు తాక ట్టుపెట్టి అప్పు చెల్లించినా లోన్లు రెన్యూవల్ చేయడం లేదు. పై అధికారులు వెంటనే స్పందించాలి..

- బండి రోసిరెడ్డి, రైతు, పెద్ద పోట్టుచేను గ్రామం, వెదురుకుప్పం మండలం.

గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ స్కూలు డైరెక్టర్ సి చంద్రమోహన్

చంద్రమోహన్ రెడ్డికి డాక్టరేట్

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్:
పుంగనూరు రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ స్కూల్ డైరెక్టర్ సి చంద్రమోహన్ రెడ్డికి భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్, జెనీవా వారి బెంగళూరు శాఖ వారు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగంలో వారు చేసిన, అందించిన సేవలకు, ప్రవేశపెట్టిన వినూత్న విధానాలను పరిశీలించి బెంగళూరు నగరంలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్ట్ సీనియర్ న్యాయవాది రాగ సందేశ్, యూనివర్సిటీ ఛైర్మన్ జే తంగవేలు, డీన్ టిఎన్ స్వామి , నేషనల్ బిజెపి ఎడ్యుకేషనల్ వింగ్ అడ్వైజర్ డాక్టర్ ఎన్ సేతు, మిలట్రీ మేజర్ విజయ్ కుమార్ , తమిళనాడు రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ జై ప్రదీప్ పాల్గొని చంద్రమోహన్ రెడ్డికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు.

మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక అధికారులు

అగ్ని ప్రమాదంలో వాహనం దగ్ధం

రూ 1.75 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి -చిత్తూరు డెస్క్:
పుంగనూరులో ఓ ఇంటి పక్కన ఉన్న చెత్తచెదారానికి నిప్పు అంటుకోవడంతో అక్కడే ఉన్న బొలెరో వాహనానికి మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో వాహనం కాలిపోయిందని అగ్నిమాపక శాఖ అధికారి సుబ్బరాజు ఆదివారం తెలిపారు. పుంగనూరు అగ్నిమాపక కేంద్ర పరిధిలో మండలం లోని మేళం దొడ్డి గ్రామంలో అగ్ని ప్రమాద వార్త వచ్చింది. వెంటనే సిబ్బందితో బయలుదేరి వెళ్లారు. కృష్ణారెడ్డి కుమారుడు ఎస్ మహేష్‌కు చెందిన నివాస గృహం పక్క న చెత్తాచెదారం అంటుకుని పక్కనే వున్న బులెరో వాహనం వినియోగం లేకపోవడంతో ముళ్ల పొదలలో ఉంచారు. వాహనం పూర్తిగా ప్రమాదానికి గురైందన్నారు. ఈ అగ్ని ప్రమాదానికి కారణం ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వల్లే ఇది జరిగినట్టు చెప్పారు. . ఈ అగ్ని ప్రమాదం లో సుమారు 1,75,000 రూపాయల వరకు నష్టం కలిగిందన్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు.

పరుగు పందెంలో పరిగెత్తున్న ఎద్దులు

ఎడ్ల పరుగు పందెం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం:
మండలంలోని ముంగరమడుగు గ్రామంలో ఆదివారం ఎడ్ల పరుగు పందెం ఘనంగా నిర్వహించారు. మొదట గ్రామంలో దేవరెద్దులను ఊరేగించి తర్వాత ఎడ్ల పరుగు పందెం నిర్వహించారు. గెలుపొందిన ఎడ్ల యజమానులకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి తమిళనాడు కర్ణాటక రాష్ట్రం నుండి అధిక సంఖ్యలో ఎడ్లు పాల్గొన్నాయి.

హౌసింగ్ ఆఫీస్‌కు నేమ్ బోర్డు కరువు

అర్జీదారుల ఇబ్బందులు

ప్రజాశక్తి -గంగవరం: గంగవరం మండలం హౌసింగ్ ఆఫీస్‌కు నేమ్ బోర్డు లేకపోవడంతో ఆఫీసుకు వచ్చిన అర్జీదారులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఈ భవనం ఆఫీసు లా కాకుండా కొత్తగా వుండడంతో హౌసింగ్ ఆఫీసు ఎక్కడ వుందో తెలియక వెతుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో పాటు కార్యాలయానికి అన్ని వేళల్లో తాళాలు వేసి ఉండడంతో చుట్టుపక్కల వారిని అడిగి కార్యాలయం వద్దకు చేరుకున్న వారికి అక్కడ తాళాలు వేసి ఉండడంతో నిరాశతో వెనుదిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికారులు వెంటనే స్పందించి హౌసింగ్ ఆఫీస్‌కు నేమ్ బోర్డు ఏర్పాటు చేస్తే కార్యాలయాన్ని వెతుక్కోవాల్సిన పని లేకుండా చేరుకుంటారని అంటున్నారు.



నేమ్ బోర్డు లేని హౌసింగ్ కార్యాలయం

ముగిసిన మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కుప్పం రూరల్:
కుప్పం పట్టణంలోని మండల ఎంపిడివో సమావేశ మందిరంలో ఎంపీపీ అశ్విని ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిడివో ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు శాఖలకు సంబంధించిన అధికారులు మాట్లాడు తూ గత మండల సర్వసభ్య సమావేశం ముగిసిన అనంతరం వారి వారి శాఖలలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. అనంతరం పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ, అర్హత కలిగిన వారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి అశ్విని

గణపతి ఆలయ మహా కుంభాభిషేకం

ప్రజాశక్తి -ఐరాల: ఐరాల మండలం ఈతమాకులపల్లెలో నూతన గణపతి ఆలయ మహా కుంభాభిషేకం మహోత్సవం ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందు ఆలయ ప్రాంగణం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం గణపతి ఆలయ కుంభాభిషేకం మహోత్సవం సందర్భంగా వేద పండితులు అందించిన పవిత్ర అభిషేక జలాలతో ఎమ్మెల్యే గణపయ్యకు అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో గణపతి హోమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులతో కలసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణం కోసం కృషి చేసిన ఈతమాకులపల్లె గ్రామస్తులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐరాల మండల అధ్యక్షులు గిరిధర్ బాబు, చిత్తూరు జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు, పూతలపట్టు నియోజకవర్గ పొలిటికల్ అడ్మినిస్ట్రేషన్ కోఆర్డినేటర్ మేదర్లమిట్ట మోహన్ నాయుడు, మాజీ ఎంపీటీసీ దేవాజీ, పూతలపట్టు నియోజకవర్గ ముఖ్య నాయకులు, ఈతమాకులపల్లె గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు చిత్రపఠం అందిస్తున్న అలయ సిబ్బంది

ఏకాగ్రతతో పరీక్షలు రాయండి

ప్రధానోపాధ్యాయురాలు శాంత కుమారి

ప్రజాశక్తి- ఐరాల: ఏకాగ్రతతో పరీక్షలు రాస్తే విజయం వరిస్తుందని ప్రధానోపాధ్యాయురాలు శాంతకుమారి అన్నారు. ఆదివారం ఐరాల మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పొలకలలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రధానోపా ధ్యాయు రాలు శాంతకుమారి , ఉప సర్పంచ్ సురేందర్ నాయుడులు ప్రసంగిస్తూ విద్యార్థి జీవితంలో 10వ తరగతి ఎంతో కీలకమని ఈ పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధిస్తే పై తరగతి లకు వెళ్లేందుకు ఈ మార్కులు దోహదం చేస్తాయని వివరించారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను స్మరించుకుని ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. అనంతరం ఆట పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థు లకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉపసర్పంచ్ బత్తల సురేంద్రనాయుడు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విద్యార్థిని విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్ర మాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ ఛైర్మన్ సుజాత శ్రీనివాసులు నాయుడు, మాజీ స్కూల్ కమిటీ ఛైర్మన్ సోమశేఖర్, ఉపాధ్యాయులు రామకృష్ణ, జయచంద్ర నాయుడు, హరి, జగన్నాథయ్య, రాధాకృష్ణ, శంకర్ రెడ్డి, జగదీశ్వర్ నాయుడు, సతీష్ నంద, వసుధాకర్, హరీఫ్, శోభారాణి, ధనలక్ష్మి, మనోరమ, పల్లవి, గౌతమి పాల్గొన్నారు.

వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న టెన్తు విద్యార్థులు

రాయితీపై వ్యవసాయ పనిముట్లు: ఏడీ

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందించనున్నట్లు పుంగనూరు వ్యవసాయ శాఖ ఏడీ శివకుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాయితీపై వ్యవసాయ పనిముట్లు సరఫరా, కార్యాచరణ మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసిందని పేర్కొన్నారు. పుంగనూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, పెద్దపంజాణి, గంగవరం మండలాలకు సంబంధించి ఆర్థిక కేటాయింపు రూ. 68.98 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. సి ఎస్ ఎస్, ఎస్ ఎంఎఎం కేటాయించిన బడ్జెట్‌లో 17 శాతం ఎస్‌సి రైతులు, 7 శాతం ఎస్‌టి రైతులకు కేటాయించినట్లు తెలిపారు. ఎనిమిది మండలాల్లోని సుమారు 408 మంది రైతులకు 64 మాన్యువల్ లేదా బ్యాటరీతో పనిచేసే స్ప్రేయర్లు, 146 పవర్ స్ప్రేయర్లు, ఒకటి ట్రాక్టర్ తో నడిచే స్ప్రేయర్, 186 ట్రాక్టర్ లాగే పనిముట్లు, 8 రోటోవేటర్స్,2 పవర్ లీడర్స్, 1 బ్రష్ కట్టర్ పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే సంస్థల నుండి సరఫరా చేస్తారని పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, మహిళా, సన్న చిన్న కారు రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐదేళ్లుగా వ్యవసాయ యాంత్రికీకరణ రాయితీపై ఉపయోగించుకోని రైతులు మాత్రమే ఇందుకు అర్హులు అని తెలిపారు. ఇ-పంటలో నమోదు చేసుకున్న పట్టాదారు పాస్‌బుక్ కలిగిన రైతులు, ఒకే కుటుంబానికి ఒక రైతు మాత్రమే అర్హుడు. రాయితీ50 శాతం అయితే ఎస్‌ఎంఎఎం మార్గదర్శకాల్లో పేర్కొన్న గరిష్ట పరిమితికి లోబడి మాత్రమే ఉండాలన్నారు. యంత్రాన్ని కొనుగోలుకు రాయితీ పోను మిగిలిన మొత్తం చెల్లించాలన్నారు. వివరాలకు మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలన్నారు.

క్రైం న్యూస్

అనుమతి లేని మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి-తవణంపల్లి: పుణ్యసముద్రం -నత్తపుచేను రోడ్డులో ఉన్న పెట్టీ షాప్ వద్ద వి సుకుమార్ అక్రమంగా ఎలాంటి లైసెన్సు లేకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లను ఎక్కువ మొత్తం లో కలిగి వుండడం , అమ్మడం ఎక్సైంజ్ కమిట్‌మెంట్ యాక్ట్ ప్రకారం నేరం కావడంతో మహజరుదార్ల సమక్షంలో అరెస్టు చేశారు. ఎస్సై చిరంజీవి ఆదేశాల మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి

మామిడి రైతులకు అవగాహన

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని గాజులపల్లి సమీపంలోని జిసిఆర్ మామిడి గుజ్జు పరిశ్రమలో మామిడిలో పూత బిందె దశలో సస్యరక్షణ చర్యలపై మామిడి రైతులకు జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన రెడ్డి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మామిడి రైతులు పాల్గొన్నారు. అలాగే గుజ్జు పరిశ్రమ యజమానులు జి గొల్లపల్లి ప్రకాశ్ రెడ్డి ఆర్టికల్చర్ అధికారులు అవగాహన కల్పించారు.

ఏపీ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఏర్పాటు

మాట్లాడుతున్న అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి- పలమనేరు: ఆంధ్రప్రదేశ్ నూతన అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లం సురేష్ బాబు, పాణ్యం వేణు, పలమనేరు కు చెందిన పి.బి .బాలసుబ్రమణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు ఎన్నో ఏళ్లుగా అష్ట కష్టాలు, అవమానాలు భరించి పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అనేక యూనియన్లు ఉన్నప్పటికీ అవి సరైన విధానాలతో పనిచేయడం లేదని తెలిపారు. అందుకే వాటన్నిటిని దృష్టిలో పెట్టుకొని నీతి నిజాయితీ, పారదర్శకంగా పనిచేయాలనే సంకల్పంతో ఏపీ అవుట్ సోర్సింగ్ అసోసియేషన్‌ను ప్రారంభించి దానిద్వారా సమస్యలు పరిష్కారం కాకుండా సతమతమవుతున్న వారిని గుర్తించి పరిష్కరిస్తామన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల, కార్మికులకు ప్రభుత్వాల ద్వారా కనీస వేతనాలు, పీఎఫ్ ,ఈఎస్ఐ, కనీస సౌకర్యాలు కల్పించడానికి అహర్నిశలు కృషి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎంత కష్టపడినా ప్రభుత్వం, అధికారుల దృష్టిలో అవుట్సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు గౌరవం దక్కలేదని , నిత్యం, వివక్షకు గురవుతున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం అసోసియేషన్ విజయవాడ వేదికగా తీసుకొని రాబోవు రోజుల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, మేధావులు సీనియర్లు సలహాలు తీసుకొని అందరి సహకారంతో అసోసియేషన్‌ను బలోపేతం చేస్తామని తెలిపారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఏ సమస్య ఉన్న నిర్భయంగా అసోసియేషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఘనంగా ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట

ప్రజాశక్తి -సోమల:
సీతా సమేత కోదండరామ స్వామి దేవస్థానంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో వెలసిన సీతా సమేత కోదండరామ స్వామి వారి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. ఎనిమిదో తేదీ శనివారం గణపతి పూజ, గోపూజ, గంగపూజ , కలశ స్థాపన, మహాస్నపన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆదివారం 9వ తేదీ ఉదయం 8.30 నుండి ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహించారు. అనంతరం ఆలయంలోని మూల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

గరిమెళ్ళ మృతికి సిఐటియు సంతాపం

ప్రజాశక్తి - తిరుమల : ప్రముఖ వాగ్గేయకారుడు, టీటీడీ మాజీ ఆస్థాన విద్వాంసులు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ హఠాన్మరణం సంగీత ప్రియులకు తీరని లోటుగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి అభివర్ణించారు. ఆదివారం సాయంత్రం భవాని నగర్, గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ నివాసంలో కందారపు మురళి ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కందారపు మురళి మాట్లాడుతూ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ తిరుమల తిరుపతి దేవస్థానానికి చేసిన విశేషమైన కృషిని గుర్తు చేశారు. మొట్టమొదటి తెలుగు వాగ్గేయకారుడు, అన్నమయ్య రచనలను వేల సంఖ్యలో గానం చేసి బాలకృష్ణ ప్రసాద్ ప్రసిద్ధులయ్యారని అన్నారు. సంగీత ప్రపంచంలో గరిమెళ్ళ స్థానం ఎవరు భర్తీ చేయలేనిదని కందారపు మురళి అన్నారు. నివాళులర్పించిన వారిలో కందారపు మురళితో పాటు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల యూనియన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మేళ్లచెరువు గంగులప్ప కూడా ఉన్నారు.

టీటీడీకి తీరని లోటు : టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

టిటిడి ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ ఆదివారం సాయంత్రం అనారోగ్యంతో పరమపదించారు. ఆయన మరణం టిటిడికి, సమాజానికి తీరనిలోటని పలువురు గాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన నివాసం వద్ద టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి నివాళులు అర్పించారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE OF :-PALAMNER
O.S. NO. 268 OF 2019
BETWEEN:-
K.S. Bhagya lakshmi ...Plaintiff
AND:-
Imran Khanam ...Defendant
Notice to the Respondent
To
Imran khanam, W/o Md. Ali Mulla Khan,
residing at D.No. 28-89/1,
Gantavooru village,
Palamaner Post and Mandal. Chittoor D,T.
Sir,
Please take notice that the above-named Suit filed the above case against you the above matter is posted to 13-03-2025 for your appearance. Please be present in the said court on the said date at about 10:30 AM either in person or through an advocate and to raise objections if any, failing which, the matter will be decided as exparte in your absence.
Date: -03-2025
Place: Chittoor
Sd/
M. PRABHAKAR, M.B.A, LLB,
Advocate
NALAGAMPALLI (V)&(P)
BANGARUPALYAM (M)
CHITTOOR (Dt), 517416.